క్లుప్తంగా

31లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలి

చండూరు : ప్లాట్ల యజమానులు 2020 సంవత్సరంలో రూ.1000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం రిజిస్టర్ చేసుకున్నవారు, అనుమతి లేని లేఅవుట్లలో ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం మార్చి 31 వరకు అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ మంగళవారం తెలిపారు. మార్చి 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేవారికీ 25 శాతం రాయితీ ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలో 11 కేవీ లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాలైన అటవీ శాఖ కార్యాలయ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, శివాలయం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: పట్టణంలోని 11వ వార్డు అర్బన్ కాలనీలో గతంలో నిర్మించిన డ్రెయినేజీ ఎత్తు పెంచి మురుగు సాఫీగా కిందకు పోయేలా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య కోరారు. మంగళవారం ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా అర్బన్ కాలనీలో డ్రెయినేజీని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, దండెంపల్లి సరోజ, యాదయ్య, విష్ణుమూర్తి, సర్దార్ అలీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నాం

చిట్యాల: మున్సిపాలిటీలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పలువురు అధికారులు, నీటి సరఫరా విభాగం సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చిట్యాల మున్సిపల్ కమిషనర్ వీరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నట్లయితే ఏఈ డి.గౌతంరాజ్ సెల్ నంబర్ 7331186853, వర్క్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ 9676218171 , ఫిట్టర్ ఏనుగు వెంకట్‌రెడ్డి సెల్ నంబర్ 9948237796 ను సంప్రదించాలన్నారు. పలువురు లైన్ మెన్‌లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు రథోత్సవం

నాంపల్లి : టీపీ గౌరారం చలిదోన లక్ష్మీనర్సింహ స్వామి రథోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వట్టికోటి రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గాయకుడికి నివాళి

నకిరేకల్ : టీటీడీ గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. కాగా నకిరేకల్‌లోని అచల గురుమందిరంలో అన్నమయ్య కళాసమితి ఆధ్వర్యంలో మంగళవారం బాలకృష్ణ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాసమితి అధ్యక్షురాలు గండెపల్లి సుమలత, మందిరం అధ్యక్షుడు మధుసూదన్, గుండా అరుణ, అనసూయ, సుకన్య, శివకోటి ఆంజనేయులు రాణి, పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విచారణ

నాంపల్లి : మండలంలోని చిట్టంపహాడ్ ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైంది. అయితే అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనుల్లో అవకతవకలు జరిగాయని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పాఠశాలలో పనులపై మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ మేరి స్వర్ణకుమారితో కలిసి విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఝాన్సీ, కార్యదర్శి శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

మునుగోడు : ఇటీవల మునుగోడులోని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న మండలంలోని పులిపలుపుల గ్రామ మహిళలకు ఉచిత కంటి అద్దాలను చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, ముఖ్తార్‌పాష, సాలయ్య పాల్గొన్నారు.

నిరుపేదలకు రంజాన్ కిట్లు

నకిరేకల్ : రంజాన్ మాసం సందర్భంగా సహాయత ట్రస్ట్ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని 200 నిరుపేద ముస్లిం కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరుకులు 25 కేజీల బియ్యంను (రంజాన్‌కిట్లు) అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ రషీద్, పహీం, అజీజ్, సయ్యద్ ఇబ్రహీం, నవీద్, షేక్ రషీద్ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

‘ఫ్లైఓవర్’ నిర్మాణ పనుల్లో జాప్యం!

- శంకుస్థాపన చేసి దాదాపు తొమ్మిది నెలలు
- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, వ్యాపారులు



చిట్యాలలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించనున్న ప్రదేశం



సర్వీస్ రోడ్డుపై కూల్చివేసిన దుకాణాల ఎదుట ఉన్న మెట్లు

చిట్యాల: ‘ప్రమాదకరంగా మారి వాహనదారుల, ప్రజల ప్రాణాలను హరిస్తున్న చిట్యాల పట్టణంలోని అరవై ఐదో నంబరు జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తాం.. పనులను వేగవంతంగా చేపట్టి డిసెంబరు వరకు పూర్తి చేస్తాం’ ఇవీ గత ఏడాది జూన్ 23వ తేదీన చిట్యాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల శంకుస్థాపన సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన మాటలు. కానీ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి సుమారు తొమ్మిది నెలలు దాటినా నేటికీ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు.

రూ.45 కోట్లతో నిర్మాణం..

చిట్యాల పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా హైదరాబాద్–విజయవాడ–నల్లగొండ–భువనగిరి వెళ్లే జంక్షన్ అతి ప్రమాదకరంగా మారింది. ఈ జంక్షన్‌లో జరిగిన ప్రమాదాల్లో ఎంతోమంది మృత్యువాత పడగా.. మరెందరో గాయాలపాలై దివ్యాంగులుగా మారారు. దీంతో ప్రమాదాల నివారణకు చర్యలను తీసుకోవాలని పట్టణ ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. స్పందించిన కేంద్రం ప్రమాదాల నివారణకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.45 కోట్ల నిధులను మంజూరు చేసింది. కాగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు గత ఏడాది జూన్ 23వ తేదీన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు శంకుస్థాపన చేశారు.

750 నుంచి 800 మీటర్ల పొడవు ఫ్లై ఓవర్..

చిట్యాల పట్టణంలో సుమారు 750 నుంచి 800 మీటర్ల పొడవున ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. పాల శీతలీకరణ కేంద్రం సమీపంలో ప్రారంభమైయ్యే సర్వీస్ రోడ్డు నుంచి ఎస్‌బీఐ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగనున్నట్లు తెలుస్తోంది. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టనున్నారు.

దుకాణాల ఎదుట మెట్ల తొలగింపు..

చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. సర్వీస్ రోడ్డులో పలు వ్యాపార, దుకాణ సముదాయాల ముందున్న మెట్లను తొలగించారు. దీంతో పలు దుకాణాల్లోకి ప్రజలు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంలో తొమ్మిది నెలలుగా తగిన వ్యాపారం లేక దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వేగవంతంగా పనులు చేపట్టాలి



చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి తొమ్మిది నెలలు దాటిపోయింది. వాహనాల రాకపోకలకు సర్వీస్ రోడ్డులో పలు దుకాణాల మెట్లను తొలగించటంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలి.

– జిట్ట నగేష్, మాజీ సర్పంచ్, చిట్యాల

రెండుమూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో ప్రారంభిస్తాం. ఇప్పటికే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టే సందర్భంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకుగాను సర్వీస్ రోడ్డులోని అడ్డంకిలను తొలగించాం.

– నాగేశ్వరరావు, హైవే రోడ్స్ పీడీ

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం చేయండి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్ : ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం చేసి ఈ నెల 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం నీలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై లైసెన్స్ టెక్నికల్ ప్లానర్లు, లేఔట్ యజమానులు, రిజిస్టర్ డాక్యుమెంట్ రైటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనుమతి లేని లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. రాయితీ అవకాశం ఈ నెల 31తో ముగుస్తుందని, ఆలోగా ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోవాలని కోరారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ కృష్ణవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నుడా పరిధిలో డీటీసీపీ లే అవుట్ ఫీజు తగ్గించాలని కోరుతూ క్రెడాయి ప్రతినిధులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. నీలగిరి మున్సిపాలిటీలో లే అవుట్ అనుమతి తీసుకోవడానికి ఫీజు తక్కువగా ఉందని, నుడా పరిధిలో ఎక్కువగా ఉందన్నారు. నుడా పరిధి 14 కిలోమీటర్లు విస్తరించి ఉన్నందున డీటీసీపీ లే అవుట్ అనుమతి తీసుకోవాలంటే అధిక ఫీజు అవుతోందని, దానిని తగ్గించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో క్రెడాయి ప్రతినిధులు వంగాల అనిల్‌రెడ్డి, అల్లి మల్లికార్జున్, జునైత్ హస్మి, పృథ్వీరాజు తదితరులు ఉన్నారు.

చిత్రపటాలకు పాలాభిషేకం

చండూరు : చేనేత కార్మికులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం చేనేత పరిరక్షణ సేవా సమితి (సిపిఎస్) ఆధ్వర్యంలో చండూరు మున్సిపల్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, కర్నాటి శ్రీనివాసులు, రాపోలు జగదీష్, వెంకటేశం, వర్కాల విజయ్, దూస గణేశ్, సంగెపు మల్లేష్, గణపతి, గంజి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పొలం బాట

నకిరేకల్ : పొలం బాట కార్యక్రమంలో భాగంగా మండలాపురం గ్రామంలో మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. నీరు లేక ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బుడిగె సైదులు, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, జిల్లా డాకయ్య, జానయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేత



సైకిళ్లు అందిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న ఇతర గ్రామాల విద్యార్థినులకు మంగళవారం సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, కె.సంజీవరావు పాల్గొన్నారు.

విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చండూరు (గట్టుప్పల్) : నియోజకవర్గవ్యాప్తంగా విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించి పంటలు ఎండిపోకుండా కాపాడాలని విద్యుత్ అధికారులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని గట్టుప్పల్ మండలానికి చెందిన కొందరు రైతులు హైదరాబాదులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే .. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా ఎక్కడెక్కడ విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యలు ఉన్నాయో పూర్తి సమాచారం స్థానిక నాయకుల ద్వారా సేకరించి సత్వరమే పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, రైతులు ఉన్నారు.

ఉపాధి పని కల్పించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

మునుగోడు: కూలీలకు ఉపాధిహామీ పని కల్పించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎక్కడ కూడా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగడం లేదన్నారు. కార్యక్రమంలో బండా శ్రీశైలం, ఫీల్డ్ అసిస్టెంట్ పరమేష, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సింగపంగ ఎల్లయ్య, కట్టా ఎల్లమ్మ, పగిళ్ల మల్లేష్, సుగుణమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

నాంపల్లి : గ్రామాల్లో ప్రజలకు ఉపాధి హామీ పనులను కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అధికారులు కోరారు. మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట కృష్ణ, నాంపల్లి యాదయ్య, లింగస్వామి తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు

చిట్యాల: వెలిమినేడు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాలుగు రోజులు గ్రామంలో సర్వే నిర్వహించి సమస్యలను గుర్తించామన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగస్వామికి వినతి పత్రం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, అర్రూరి శ్రీను, మాజీ ఎంపీటీసీలు నెల్లికంటి నర్సింహ, దేశబోయిన సరస్వతి, స్వరూప, గ్రామ కార్యదర్శులు పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుమర్తికి వినతి

నకిరేకల్ : వీఆర్‌ఏల వారసులకు వీఎల్ఓ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు పలువురు వినతి పత్రం సమర్పించారు. 61 సంవత్సరాల వయస్సు పైబడిన వీఆర్‌ఏ వారసులకు గత ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 340 మందికి పైగా వీఆర్‌ఏలు మృతి చెందారని తెలిపారు. ఇంకా అనేక మంది వీఆర్‌ఏలు అనారోగ్యానికి గురై ఉద్యోగం చేసే పరిస్థితి లేదని చిరుమర్తి దృష్టికి తీసుకొచ్చారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

నల్లగొండ : నల్లగొండ పట్టణంలో బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 4 మోటారు సైకిళ్లు, 2 గ్యాస్ స్టవ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన పెరికె కిరణ్ కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కాలేజీలో 2016లో ఎంఎల్‌టీ పూర్తి చేశాడు. 2018లో బోయవాడకు చెందిన గణపతి కూతురు రమ్యతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కిరణ్ కేటరింగ్ పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన కిరణ్ డబ్బులు లేకపోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. మోటారు సైకిళ్లు చోరీ చేసి వాటిని అమ్మితే డబ్బులు వస్తాయని భావించి నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 4 మోటారు సైకిళ్లు చోరీ చేశాడు. శివాజీనగర్‌లో పగటిపూట ఇంటి తాళం పగులగొట్టి గ్యాస్ స్టవ్‌లు చోరీ చేశాడు. మంగళవారం ఉదయం 7.30కు పానగల్ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కిరణ్ మోటారు సైకిల్‌పై గ్యాస్ స్టవ్‌లను పెట్టుకుని వెళ్తుండగా.. అనుమానం వచ్చి టూటౌన్ ఎస్‌ఐ సైదులు, సిబ్బంది అతడిని పట్టుకుని విచారించగా చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో టూటౌన్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో టూటౌన్ ఎస్‌ఐ సైదులు, సిబ్బంది శంకర్, బాలకోటి కలిసి నిందితుడి నుంచి వస్తువులను రికవరీ చేశారు. ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ, సీఐలు అభినందించారు.

మైక్‌సెట్ బహూకరణ

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల డైరెక్టరేట్ ఆఫ్ సర్వీస్ సెన్సస్ ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ వీపూరి శ్రీకాంత్ తన తండ్రి వీపూరి భిక్షమయ్య జ్ఞాపకార్థం మైక్ సెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నోముల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మిర్యాల చల్మరాజు, ఆ పాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గోవర్ధన్, ఆదిత్య, అనిత పాల్గొన్నారు.

పలువురికి సన్మానం



నల్లగొండ టూటౌన్ : పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండ పట్టణంలోని 29వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ శక్తి సూపర్ షీ నల్లగొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ వడ్డేపల్లి ఎల్లోర, వడ్డెపల్లి కాశీరాం, మహాలక్ష్మి, పరశురాం, మాతంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చండూరు : పుల్లెంల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కూపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ సహకారంతో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, ఇరిగి శివ, ముక్కాముల రాజు, సైదులు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, హైమావతి, సువర్ణ, సునీత, సుగుణ, లక్ష్మీ, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు పంపిణీ చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద రూ.85.34 లక్షల వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అదే విధంగా ఔరవాణి గ్రామంలో రూ.56.45 లక్షల వ్యయంతో మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం, మంత్రుల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, పుల్లంల అచ్చాలు, నల్లబోతు సత్తయ్య, నరేందర్ రెడ్డి, బొడిగె స్వామి, మధు తదితరులున్నారు.

సాయిరాంను అభినందించిన ఎమ్మెల్యే

నకిరేకల్ : తమిళనాడులో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో రిసెర్చ్ స్కాలర్(పీహెచ్‌డీ)గా ఎంపికైన నకిరేకల్ పట్టణానికి చెందిన గంజి సాయిరాంను మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ వారు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో గంజి సాయిరాం ప్రతిభ కనబరిచి రిసెర్చ్ స్కాలర్‌గా అవకాశం దక్కించుకున్నారు. ప్రొఫెసర్, అడిషనల్ హెడ్ డాక్టర్ ఎం.మహాలింగం పర్యవేక్షణలో కబడ్డీ క్రీడాకారుల ఫిట్నెస్, శిక్షణ పద్ధతులకు సంబంధించి తాను పరిశోధన చేయనున్నట్లు గంజి సాయిరాం తెలిపారు. తనకు కోగైడ్‌గా తమిళనాడుకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గోవిందస్వామి వ్యవహరించనున్నారని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల రిలే దీక్షలు



చండూరులో రిలే దీక్షలో పాల్గొన్న నాయకులు

చండూరు : మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీలను ఏ, బీ, సీ కాకుండా ఏ, బీ, సీ, డీ 4 గ్రూపులుగా సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చండూరు మండల కేంద్రంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో నల్లగంటి రమేష్ మాదిగ, ఆకారపు ఏసు, కురుపటి శంకర్, బుషిపాక సురేష్, గుండెల శ్రవణ్, పోలె గిరి, బుషిపాక వాసుకుమార్, ఉపేందర్, గంటికంపు దాసు పాల్గొన్నారు.

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముదిగొండ రమేష్ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లగొండ టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ అద్దెలు రేషియో ప్రకారం చెల్లించాలని, మెటీరియల్ రవాణా చార్జీలు ప్రాజెక్టు అధికారులే చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలల ఏరియర్స్, 24 రోజుల సమ్మె కాలం వేతనాలు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. ఈ నెల 15 నుంచి ఒక పూట అంగన్‌వాడీ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరారు. ధర్నాలో కె విజయలక్ష్మి, పి సరిత, ప్రమీల, మనిరూప, రాజేశ్వరి, పాదూరు లక్ష్మి, స్వప్న, జ్యోతి, కవిత, భారతి పాల్గొన్నారు.

కబ్జా భూమి స్వాధీనానికి కసరత్తు



మునుగోడులో సర్వే చేస్తున్న అధికారులు

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 78లో కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. మునుగోడులో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు నిర్మించేందుకు అవసరమైన భూమి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గమనించిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల కలెక్టర్‌తో మాట్లాడి మునుగోడులో ప్రభుత్వ భూములను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడైనా కబ్జాకు గురైతే స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి.. చండూరు ఆర్డీఓకు ఆదేశాలు ఇచ్చారు. ఆర్డీఓ ఆధ్వర్యంలో సర్వే నంబర్ 78 రికార్డులను పరిశీలించి రెండు రోజులుగా సర్వే చేస్తున్నారు.

మొత్తం 150 ఎకరాల 33 గుంటల భూమి..

మునుగోడు మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 78లో మొత్తం 150 ఎకరాల 33 గుంటల ప్రభుత్వ భూమి రికార్డుల్లో ఉంది. అందులో దాదాపు 20 ఎకరాలకు పైగా మర్రివాగు ఉండగా 6 ఎకరాల్లో బృహత్ ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. మిగిలిన దానిలో ఎకరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మరో ఎకరంలో లారీ ఆఫీసు, మరో 2 ఎకరాల్లో కస్తూరిబా పాఠశాలలు ఉన్నాయి. 1980లో 5 ఎకరాల 10 గుంటల భూమి పేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చారు. ఇటీవల మరో ఎకరం 20 గుంటల భూమి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, చేనేత భవనానికి 20 గుంటల భూమి, దాదాపు 90 ఎకరాల వరకు నిరుపేదలకు వ్యవసాయం చేసుకునేందుకు అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. వాగు 20 ఎకరాలు కలుపుకుని మొత్తం 128 ఎకరాల భూమి వివిధ రూపాల్లో అధికారులు కేటాయించినట్లు రికార్డుల్లో నమోదయింది. ఇంకా 22 ఎకరాల 33 గుంటల భూమి రికార్డుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆ భూమిని కొందరు కబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నాలుగు టీంలతో సర్వే చేయిస్తున్నాం



సర్వే నంబర్ 78లో కబ్జాకు గురైన భూమిని గుర్తించేందుకు నాలుగు టీంల ద్వారా సర్వే చేయిస్తున్నాం. కబ్జాకు గురైన భూమిని గుర్తించి స్వాధీనం చేసుకుంటాం.

– ఎం. నరేందర్, తహసీల్దార్

నిస్వార్థంగా పనిచేసే వారికి గుర్తింపు

కేతేపల్లి: కాంగ్రెస్ పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన కెతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం కేతేపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్‌కే.లతీఫ్, బయ్య ముత్తయ్య, మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, కోట పుల్లయ్య, సోమలింగంయాదవ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

చండూరు(గట్టుపల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు వెల్మకన్నె రోడ్డులోని స్థలాన్ని పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, తహసీల్దార్ రాములు, ఏఈ సతీష్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రాజుతో కలిసి పరిశీలించారు. వారి వెంట సబ్ సెంటర్ డాక్టర్ అశోక్, కార్యదర్శి షఫి, నాయకులు దండు యాదగిరిరెడ్డి, సామల యాదయ్య ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మకు పూజలు



దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవస్థానం వద్ద మంగళవారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి ఆలయ అర్చకులు నవహారతులతో అఖండ పూజలు నిర్వహించారు.

‘ఇందిరమ్మ ఇళ్లలో నాణ్యత లేదు’

నల్లగొండ టూటౌన్ : ఇందిరమ్మ ఇళ్లలో నాణ్యత లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలుచేయలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు.